దివ్యదర్శన నిలయం ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బ్రహ్మకుమారీలు

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 16 : బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దివ్యదర్శన నిలయానిన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, బీజేపీ నాయకులు రఘునాథ్, శాంతిసరోవర్ డైరెక్టర్ కుల్దీప్ దిదీజీ, బ్రహ్మకుమారీస్ కరీంనగర్ రీజినల్ ఇన్‌చార్జి విజయ బహన్‌జీ, మున్సిపల్ మాజీ చైర్మన్ మంగీలాల్ సోమానీ, మాజీ కౌన్సిలర్ చైతన్యరెడ్డి, మంచిర్యాల ఇన్‌చార్జి రమక్కయ్య, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. దివాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రజలు శాంతి మార్గంలో నడిచేందుకు బ్రహ్మకుమారీలు చేస్తున్న కృషి అభినందనీయమని, ఒత్తిడిని జయించేందుకు మెడిటేషన్ ప్రక్రియ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. దివ్యదర్శన నిలయంలో మెడిటేషన్‌పై ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

పీటీజీ గురుకులంలో పర్యవేక్షిస్తున్న సెంటర్ సీఎస్ కారం భద్రయ్య

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 16 : గిరిజన సంక్షేమ శాఖ ప్రతిభా కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. పీటీజీ గిరిజన గురుకులంలో 320 మందికి గాను 300 మంది.., గిరిజన బాలికల కళాశాలలో 245 మందికి 221 మంది.., గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో 320 మందికి 306 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు కారం భద్రయ్య, అనిత, తక్షశిల తెలిపారు. పీటీజీ గురుకులంలో అబ్జర్వర్‌గా తీర్యాణి కళాశాల అధ్యాపకురాలు సౌమ్య వ్యవహరించారు.

కాలువలోపడ్డ మనుబోతు

నీటిలో పడిపోయిన మనుబోతు

వాంకిడి, ఫిబ్రవరి 16 : వాంకిడి మండలం సరండి గ్రామ సమీపంలోని అడ ప్రాజెక్టు ప్రధాన కాలువలో ఆదివారం మనుబోతు పడినట్లు ఎఫ్ఎస్వో మలయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచినీటి కోసం వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయింది. స్థానిక రైతులు గమనించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రైతుల సాయంతో మనుబోతు ప్రాణాలను కాపాడారు. అనంతరం సమీప అటవీ ప్రాంతంలో వదిలేశారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎఫ్‌బీవో రామ్ మూర్తి తదితరులు ఉన్నారు.

మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుతాం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 16 : మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్ స్పష్టం చేశారు. నస్పూర్ నర్సయ్య భవన్‌లో ఆదివారం సీపీఐ మంచిర్యాల నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యాతిథిగా హాజరై, మాట్లాడారు. దేశంలో సమానత్వం ఉండకూడదని రాజ్యాంగ మౌలిక సూత్రాలను మార్చాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. రైతు చట్టాలను మార్చి వారికి హక్కులు లేకుండా చేసిందని, బడా వ్యాపారవర్గాల కోసం పనిచేస్తుందని ఆరోపించారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అంటే పేద ప్రజల వికాసం కాదని, కార్పొరేట్ కంపెనీల వికాసమని విమర్శించారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లుల పేర్కొన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి జోగుల మల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేశ్, మిర్యాల రాజేశ్వర్‌రావు, ముస్కె సమ్మయ్య, బాజీసైదా, రేగుంట చంద్రకళ, కొట్టె కిషన్‌రావు, దొడ్డిపట్ల రవీందర్, దేవి పోచన్న పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని బాలుడికి గాయాలు

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 16 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని లోశనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని బైకు ఢీకొని బాలుడు రత్నం అశ్విత్ (8)కు తీవ్రగాయాలయ్యాయని సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మధ్యాహ్నం భోజనం కోసం స్కూలు నుంచి అమ్మమ్మ గోదారి లచ్చక్కతో కలిసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని బైకు వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టింది. దీంతో అశ్విత్ తలకు గాయాలయ్యాయి. స్థానిక ప్రేవేటు దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హెదరాబాద్ తీసుకెళ్లారు. బాలుడి చిన్నాన్న రత్నం అగ్గోర్ ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుభవ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలి

మందమర్రి, ఫిబ్రవరి 16 : గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరలో సేవాభావంతో ప్రజలకు వైద్యం అందిస్తున్న అనుభవ వైద్యులు(ఆర్ఎంపీ, పీఎంపీ)లకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని ఆ సంఘం పట్టణాధ్యక్షుడు కట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనుభవ వైద్యుల సమస్యల పరిష్కారం భవిష్యత్ కార్యాచరణ కోసం సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 18న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు సంబందించిన చలో హైదరాబాద్ పోస్టర్లను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు గాదాసు శంకర్, గోనె గోవర్దన్, మంద తిరుమల్ రెడ్డి, చింతల పోశం, లక్ష్మణ్, గోనె సత్యం తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 16 : ఆరు గ్యారెంటీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన సీపీఐ (ఎంఎల్) చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి పేర్కొన్నారు. జనకాపూర్‌లో ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 14 నెలలు అయినా అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ హామీల అమలు కోసం సీపీఐ (ఎం ఎల్) చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, వియవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు వీరన్న, బాబా, శంకర్, సురేశ్, బాషు, గౌస్, రవి, తుకారాం, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎండీ, డైరెక్టర్ల క్షేత్రస్థాయి పర్యటనలు

- సింగరేణి వ్యాప్తంగా ముగిసిన పరిశీలనలు
- కొత్త పని విధానాల అమలుకేననే అభిప్రాయాలు

గనిలోని పనిస్థలాల్లో అధికారులు, కార్మికులతో సీఎండీ బలరాం, డైరెక్టర్లు(ఫైల్)

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 16 : సింగరేణి వ్యాప్తంగా సంస్థ సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్ (ఆపరేషన్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) కే వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు, ఉత్పత్తి వ్యయం తగ్గింపునకు సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తీసుకున్నారు. మూడు రోజుల పాటు శ్రీరాంపూర్, మంద మర్రి, బెల్లంపల్లి, ఆర్జీ-1, 2, 3 ఏరియాలతో పాటు, భూపాలపల్లిలో కొనసాగిన సీఎండీ పర్యటనలో గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల్లో పర్యటించారు. మొత్తం 20 గనులు, ఎస్టీపీపీలో వేల మంది కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో నంబర్‌వన్‌గా నిలువాలని సీఎండీ కార్మికులకు పిలుపునిచ్చారు. నాణ్యతకు మన బొగ్గు చిరునామా కావాలని సూచించారు. రక్షణలో దేశానికి ఆదర్శంగా నిలుపాలని అవగాహన కల్పించారు. భూగర్భ గనుల్లో మహిళల సేవలను వినియోగించుకుంటామని మహిళా ఉద్యోగులతో స్పష్టం చేశారు. ఓసీ గనుల్లో ఈపీ ఆపరేటర్లుగా అతివలకు అవకాశం ఇస్తామని వెల్లడించారు. ప్రతీ ఉద్యోగి 8 గంటల పాటు పని చేయాల్సిందేనని, యంత్రాల పని సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని అధికారులు, కార్మికులకు సూచించారు. గైర్హాజరీ చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మస్టర్ పడి బయట తిరిగే వాళ్ల వివరాలు అందిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సీఎండీ పర్యటన తర్వాత సింగరేణిలో నూతన పని విధానం, యంత్రాల సామర్థ్యం, పనిగంటల పెంపునకు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. అంతే కాకుండా ఉత్పత్తి పెరుగుదలకు 4 షిఫ్టుల విధానంపై అధ్యాయనం చేస్తున్నట్లు సమాచారం కోలిండియాలో ఈ విధానం అమలవుతున్నదని, అదే విధానం సింగరేణిలో అమలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కోలిండియాలో ప్రైవేట్ బొగ్గు సంస్థల్లో పలు కంపెనీలు 4 షిఫ్టుల విధానం అమలుపై అధికారులు చర్చిస్తున్నట్లు సమాచారం ఈ మేరకు కార్మిక సంఘాల ముందు ఈ విధానంపై చర్చకు పెడుతున్నారు. ఆర్కే 7గనిపై ఏఐటీయూసీ నాయకులతో సీఎండీ 4 షిఫ్టుల ఏర్పాటుపై వివరించారు. కార్మికులకు అనుకూలంగా ఉండే సమయాలు సైతం సూచించాలని వారిని అభిప్రాయాలు అడిగారు. దీంతో 4 షిఫ్టుల ఏర్పాటుపై సీఎండీ కృత నిశ్చయంతో ఉన్నట్లు స్పష్టమవుతున్నది.

మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

షమీం అక్తర్ నివేదిక తప్పులతడక

- సవరించాలని దళిత సంఘాల డిమాండ్
- నివేదిక కాపీల దహనం

వాంకిడి, ఫిబ్రవరి 16 : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రంలో పర్యటించిన షమీం అక్తర్ ఏకసభ్య కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించిన రిపోర్టు తప్పులు తడకగా ఉందని, దానిని సవరించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహాల్కర్ మాట్లాడుతూ.. కమిషన్ సిద్ధం చేసిన నివేదికలో చాలా తప్పులు దొర్లాయని, ఏకపక్ష నిర్ణయంతో మాల, మహర్లకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ ఆదిలాబాద్‌కు వచ్చిన సందర్భంగా మాదిగలకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, మహార్, మాల సంఘాల నాయకులు ఇచ్చిన వినతులను పూర్తిగా స్వీకరించలేదని ఆరోపించారు. ఫిబ్రవరి 4న అసెంబ్లీలో బిల్లును ఆమోదిస్తూ సోషల్ జస్టిస్ డే గా నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం షమీం అక్తర్ నివేదిక నకలు కాపీలను దహనం చేశారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసారాజ్, సమాజ అధ్యక్షుడు విలాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఉప్రే రోషన్, విజయ్, అరుణ్, దుర్గం దీపక్, డిలాజీ, మారుతి, ఇంద్రజిత్, రమేశ్, నాగ్‌సేన్, ప్రదీప్, తిరుపతి, నూతన్, విఠల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గాంధారి మైసమ్మ జాతర

మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 16 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి 9వ వార్డు (బొక్కల గుట్ట పంచాయతీ శివారు)లోని ఆదివాసీ నాయక్‌పోడ్‌ల ఆరాధ్యదైవం గాంధారి ఖిల్లా మైసమ్మ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి నాయక్ పోడ్ గిరిజనులు, గిరిజనేతరులు, ఇతర జిల్లాలోని గిరిజన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి మైసమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడే వంటావార్పు చేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌కు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ హాజరయ్యారు. ముందుగాఖిల్లాలోని ప్రథమ ధర్మాజ వద్ద గల కాళభైరవుడికి పూజలు చేశారు. మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీటీ రవీందర్, బొక్కలగుట్ట పంచాయతీ కార్యదర్శి విద్యాలత, జాతర నిర్వాహకులు నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు మేచినేని రాజయ్య, గంజి రాజన్న, రొడ్డ రమేశ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏసిపి ఆధ్వర్యంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి పర్యవేక్షణలో రామకృష్ణాపూర్ ఎస్ఐ జీ రాజశేఖర్, బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని సుమారు 180 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రెండు షిఫ్టుల డ్యూటీ అమలు చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 16 : రైల్వే విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు షిఫ్టుల డ్యూటీ విధానం అమలు చేయాలని మజ్దూర్ యూనియన్ సీనియర్ నాయకుడు ప్రభాకర్ కల్ల డిమాండ్ చేశారు. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మాజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు పిలుపు మేరకు ఆదివారం బెల్లంపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణలో చలో రైల్ నిలయం సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలపు మ్యానువల్‌ను మార్చాలని, ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ వారికి రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, డ్రెస్ అలవెన్స్ పెంచాలని కోరారు. పలు రకాల ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, 20 శాతం లాటర్ ఇండక్షన్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 18న జరిగే మహా నిరాహారదీక్షకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, హరివర్షిత్, అన్నపూర్ణ, రమేశ్ కుమార్, రమేశ్, అనిల్, రాజేందర్, కార్మికులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

రెబ్బెన, ఫిబ్రవరి 16 : ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాని డాక్టర్ విశ్వనాథ మహర్షి అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా 16వ తేదీన గోలేటి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే ఆయుర్వేద వైద్య శిబిరాన్ని చేసుకొవాలని కోరారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విశ్వనాథ మహర్షి

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

సింగరేణి పాఠశాలలో నాణ్యమైన విద్య

- శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్
- ఘనంగా 47వ వార్షికోత్సవం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 16 : సింగరేణి పాఠశాలలో అతి తక్కువ ఫీజులు, సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్ తెలిపారు. సీసీసీ టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల 47వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తాను కూడా సింగరేణి పాఠశాలలోనే చదువుకొని ఈ స్థాయికి వచ్చినట్లు చెప్పారు. ఏరియా పరిసర ప్రాంతాల విద్యార్థులు సింగరేణి పాఠశాలలో చదువుకొని బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. అనంతరం కొత్తగూడెం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు, ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని ప్రణాళిక ప్రకారం ముందుకెళితే చక్కటి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలు, చదువుల్లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ-అరుణ దంపతులు, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, జీఎం సతీమణి శ్రీమతి, ఎడ్యుకేషన్ కార్యదర్శి సతీమణి శ్రీదేవి, పాఠశాల హెచ్ఎం సంతోష్, సీనియర్ ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, లక్ష్మయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ దందాలపై దాడులు

పేకాట, గుడుంబా, బియ్యం తరలింపులో 19 మందిపై కేసు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 16 : అక్రమ దందాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై చింతలమానేపల్లి పోలీసులు ఒకేరోజు 5 కేసులు నమోదు చేశారు. ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ ఆధ్వర్యంలో మండలంలో పేకాట, గుడుంబా స్థావరాలపై మెరుపుదాడులు చేయడంతో పాటు, మహారాష్ట్రకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యం పట్టుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. బాబాసాగర్ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట ఆడుతున్న 10 మందిని పట్టుకొని, రూ.2,360, బైకును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కే నిలేశ్, కే నాందేవ్, సీహెచ్ లింగయ్య, సీహెచ్ అశోక్, వీ లక్ష్మయ్య, జీ ప్రభాకర్, ఈ ధర్మయ్య, కే మహేశ్, పీ శంకర్, డీ రంజిత్‌పై కేసు నమోదు చేశారు. అలాగే డబ్బా గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరు గురిని పట్టుకొని, రూ.2,140 స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ గుర్లె వసంత్, సీహెచ్ భీమేశ్, జీ గణేశ్, డీ తిరుపతి, పీ తిరుపతి, వీ పురుషోత్తంపై కేసు నమోదు చేశారు. గూడెం మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని, షేక్ నయిముద్దీన్‌పై కేసు నమోదు చేశారు. అలాగే కర్జెల్లి నుంచి గూడెం వైపు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 55 లీటర్ల గుడుంబా పట్టుకొని చౌదరి అంకులు, చౌదరి మధునయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తం 19 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సోమినిలో రేషన్ బియ్యం పట్టివేత..

బెజ్జూర్, ఫిబ్రవరి 16 : మండలంలోని సోమిని గ్రామానికి చెందిన బోగ మొండయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రవీన్ కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారంతో సోమిని గ్రామంలో సోదాలు చేయగా, మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొండయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈడబ్ల్యూసీ రద్దయ్యే దాకా పోరాటం

ఆత్మీయ సమ్మేళనంలో బీసీ నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 16 : తెలంగాణాలో ఈడబ్ల్యూసీ రద్దయ్యే దాకా పోరాటం చేస్తామని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగం సూర్యారావు పేర్కొన్నారు. జిల్లా బీసీ సమాజ్ ఆధ్వర్యంలో నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరిట 10 శాతం రిజర్వేషన్ కల్పించి, బీసీ సమాజానికి అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇదే తరహాలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయ కోసం ఈబీసీ పేరిట 10 శాతం ముస్లింలను బీసీల్లో చేర్చించని ఆరోపించారు. దీని వల్ల బీసీలకు రాజకీయంగా చట్టసభల్లో ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లుగా బీసీల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ జన గణన తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. కుల గణన శాస్త్రీయంగా జరుగలేదని విమర్శించారు. రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జనాభా లెక్కలు తేలిన తర్వాతే అసెంబ్లీలో బిల్లు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, డాక్టర్ రఘునందన్, కరుణ శ్రీధర్, నాయకులు బెల్లంకొండ మురళి, రంగు రాజేశం, హరిప్రసాద్, తుల మధు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అన్నారం కనకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ మల్లికార్జున్, మల్లేశ్, స్వర్ణలత, ఉమాదేవి, పద్మావతి, రవీందర్, పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

బెజ్జూర్, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలోని లంబాడీగూడ గ్రామంలో గల జగదాంబా ఆలయంలో ఆదివారం సేవాలాల్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. కేశ నాయక్, భిక్షపతి, ఛత్రు నాయక్, అమ్రే నాయక్, మంజూ నాయక్, కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వేమనపల్లి, ఫిబ్రవరి 16 : మండలంలోని జక్కెపల్లి గ్రామానికి చెందిన పొర్తెటి కాంతారావు-సంధ్య దంపతుల పెద్ద కొడుకు పొర్తెటి అనిల్‌కుమార్ గతేడాది ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. శిక్షణ పూర్తిచేసుకొని ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పోలీస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామస్తులు అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టి ఉన్నతంగా చదువుకొని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్, కిష్టయ్య, తరుణ్, జయరాం, రాజం, తల్లిదండ్రులు కాంతారావు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హరికథా గానం

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 17 : చెన్నూర్ పట్టణంలోని రౌండ్ హనుమాన్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన హరికథా గానం శ్రోతలను అలరించింది. వాచస్పతి బ్రహ్మశ్రీ ముప్పవరపు వెంకట సింహాచల శాస్త్రి సుందరకాండ హరికథా గానం వినిపించారు. సందర్భోచితంగా ప్రస్తుత పరిస్థితులను వివరించారు. కథ మధ్యలో చలోక్తులతో ఆకట్టుకున్నారు. రేగళ్ల భూషణ్ శర్మ వాయిద్య సహకారం అందించారు. కీ.శే. శ్రీమతి శ్యామలా సత్యనారాయణ రావు ప్రారంభించిన ఈ భజన కార్యక్రమం 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా వారి కొడుకులు రేగళ్ల శ్రీనివాస్, భూషణ్ శర్మ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయం

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 16 : కాగజ్‌నగర్ మండల కేంద్రం భట్టుపల్లి చౌరాస్తాలోని ఉప్పరి మల్లేశ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మున్నూరు కాపు సంఘం నాయకులు మెరుగైన వైద్యం కోసం రూ.21వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజ్జి రామయ్య, కిషన్‌రావు, రమణయ్య, జలపతి, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టాలెంట్ టెస్ట్

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 16 : జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజయవంతంగా ముగిసిందని జిల్లా కార్యదర్శి సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగ